వరి గడ్డే వరమాయే..!

- నాగవరప్పాడులో 80 శాతం పైగా వరి గడ్డి వ్యాపారులే
- ఎకరం వరిగడ్డి రూ.7 వేల నుంచి రూ.8 వేలకు కొనుగోలు
- గ్రామాలు, పట్టణాలకు వరి గడ్డి ఎగుమతులు
- తాతల నాటి నుంచి వ్యాపారం
- పశు పోషకులకు అనువైన ధరల్లోనే ఎండు గడ్డి


నాగవరప్పాడు వద్ద ఎగుమతులకు సిద్ధంగా ఉన్న వరి గడ్డి ట్రాక్టర్లు

ఉంగుటూరు: మండలంలో నాగవరప్పాడు గ్రామంలో 1500 కుటుంబాలు నివాసం ఉండగా 80 శాతం రైతులు, కౌలు రైతు కుటుంబాలే. దీంతో వారు వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ పనులపైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. గ్రామ నలు వైపుల వరి పొలాలు చుట్టి ఉండటంతో వరినే ప్రధాన పంటగా సాగు చేస్తున్నారు. దీంతో పాడికి సరిపడ పశుగ్రాసమైన ఎండు గడ్డి ఎక్కువగా లభిస్తోంది. ఫలితంగా వరి గడ్డిని పరిసర గ్రామాల రైతుల అవసరాలకు తగ్గట్టుగా అందజేస్తారు. వివిధ జిల్లాల్లోని పశు పోషకులకు వరి గడ్డిని చేరవేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు.

వరి గడ్డి వ్యాపారమే ప్రధాన జీవనోపాధి..

రైతులు, కౌలు రైతులు రెండు నుంచి 10 ఎకరాలు వరి సాగు చేసి ట్రాక్టరు ఏర్పాటు చేసుకుంటున్నారు. వారికున్న పొలంతో మరి కొంత కౌలు చేస్తూ పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడ్డారు. పొలంలో వచ్చే వరి గడ్డిని వారి పశువులకు మేతగాను విని యోగిస్తారు. పరిసర పొలాల్లోని వరిగడ్డిని కొనుగోలు చేసి పట్టణ ప్రాంత పశుపోషకులకు వరి గడ్డిని ఎగుమతి చేస్తున్నారు.

వరి గడ్డి ఎగుమతులు..

మారు మూల పల్లెల నుంచి చుట్టు పక్కల గ్రామాలతో పాటు పట్టణ ప్రాంతాలకు ఎండు వరి గడ్డి ఎగుమతులు చేస్తుంటారు. పట్టణాలు, ఇతర పలు ప్రాంతాల పాడి రైతులు ఈ గ్రామం నుంచే వరి గడ్డి కొనుగోలు చేస్తుంటారు. జనవరి వరికోతలు ప్రారంభంతోనే వరి గడ్డిని నిల్వ చేసుకునే పనిలో నిమగ్నమవుతారు. వరి గడ్డి ట్రాక్టర్లు రహదారుల వెంబడి బారులు తీర్చి పెట్టుకుంటారు. ట్రాఫిక్ సమస్య దృష్ట్యా వరి గడ్డిని అర్ధ రాత్రి నుంచి తెల్లవారుజామున తరలిస్తారు. ఈ విధంగా ఉంగుటూరు మండలం నాగవరప్పాడు వరిగడ్డి ఎగుమతులు రాష్ట్ర నలుమూలల వ్యాపించింది.

పట్టణ పశుపోషకులకు..



వరి కోతలు ప్రారంభం నుంచే ఎండుగడ్డిని సేకరించి సిద్ధం చేసుకుంటాం. పట్టణ ప్రాంత పశుపోషకుల అవసరాల మేరకు పరిసర ప్రాంతాలను రైతులు, కౌలు రైతుల నుంచి వరిగడ్డిని కొనుగోలు చేస్తాం. ఎకరా వరిగడ్డి రూ.7 వేల నుంచి 8 వేల వరకు వెచ్చించి గడ్డి కొనుగోలు చేసి సరసమైన ధరలకే వరి గడ్డి ఎగుమతులు చేస్తున్నాం.
–షేక్ నన్నా సాహెబ్

పూర్వికుల నుంచే వ్యాపారం..



తాతల కాలం నుంచి ఎద్దుల బండ్ల ద్వారా వరి గడ్డి ఎగుమతుల వ్యాపారం చేస్తున్నాం. వరి గడ్డి వ్యాపారంతో జీవనం కొనసాగిస్తున్నాం. ట్రాఫిక్ సమస్య దృష్ట్యా అర్ధరాత్రి, తెల్లవారు జామున వరిగడ్డి తరలిస్తుంటాం. యంత్రాలతో వరి కోతలు చేయడం వలన ఎండు గడ్డి కొరత ఏర్పడుతోంది. పట్టణ పశుపోషకులు ముందుగానే గడ్డి అవసరతను తెలియజేస్తే ఆ మేరకు తరలిస్తాం.
–గాబ్రెల్

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం


మాత్రలు అందజేస్తున్న వైద్య సిబ్బంది


నులి పురుగు నివారణ మాత్రలను అందజేస్తున్న ఎంపీడీఓ విమాదేవి, డాక్టర్ తేజస్విని


విద్యార్థులకు మాత్రలు వేస్తున్న డాక్టర్ మంజూష, ప్రజా ప్రతినిధులు

కంకిపాడు: నులి పురుగుల నివారణతో ఆరోగ్యం మెరుగుపడుతుందని ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుందర్‌కుమార్ అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు పీహెచ్‌సీ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఉప్పలూరు ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు వైద్యాధికారి సుందర్‌కుమార్ నులి పురుగు మాత్రలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ భాస్కర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ రాచమళ్ల శ్యాం ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో మాత్రలు పంపిణీ

కంకిపాడు: మండలం వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నులి పురుగు నివారణ మాత్రలు పంపిణీ కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఉప్పలూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో నులిపురుగు మాత్రలు పంపిణీని గ్రామ సర్పంచ్ లాం సోనియా ప్రారంభించారు. కందలంపాడులో సర్పంచ్ బాయిరెడ్డి నాగరాజు విద్యార్థులకు నులిపురుగు మాత్రలు అందించారు. కోలవెన్ను ఎంపీపీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ సురేష్‌కుమార్, ఉపసర్పంచ్ కె.వెంకటరావు, హెచ్‌ఎం శొంఠి మాధవరావు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గంగూరులో..

పెనమలూరు: గంగూరు గ్రామంలో మంగళవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా చిన్నారులకు నులిపురుగుల నివారణ మందు మాత్రలు వేశారు. గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు అబ్దుల్ గని అంగన్‌వాడీ కేంద్రంలో, సీఎస్‌ఐ పాఠశాలలో, ఉర్దూ పాఠశాలలో చిన్నారులకు నులిపురుగుల నివారణ మందు బిళ్లలు వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సిబ్బంది, ఆశవ ర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నులి పురుగుల నివారణ మాత్రలను వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పంపిణీ చేశారు. ముస్తాబాదలో సర్పంచ్ వేము రాధాకృష్ణ , సీఆర్‌పీ బి.దుర్గాదేవి నులి పురుగుల మాత్రలు విద్యార్థులకు అందజేశారు. మాదలవారిగూడెంలో పీహెచ్‌సీ వైద్యుడు శివప్రసాద్ మాత్రలు అందజేశారు.

ఉయ్యూరులో..

ఉయ్యూరు: నులి పురుగు నివారణ మాత్రలను తప్పనిసరిగా తీసుకోవాలని ఎంపీడీఓ విమాదేవి అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని చైతన్య పాఠశాలలో మంగళవారం డీ వార్మింగ్ డే నిర్వహించారు. విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలను అందించారు. ఎంపీడీఓ విమాదేవి మాట్లాడుతూ నులి పురుగును నులిమేద్దామన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ తేజస్విని, పాఠశాల ప్రిన్సిపాల్ పుల్లయ్య వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తప్పక వేసుకోవాలి..

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులి పురుగుల నిర్మూలన మాత్రలను తప్పక వేయించాలని బాపులపాడు ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి అన్నారు. స్థానిక నూజివీడురోడ్డులోని జెడ్పీ హైస్కూల్‌లో డీవార్మింగ్ డేను మంగళవారం వారు ప్రారంభించారు. విద్యార్థుల్లో నులి పురుగుల నిర్మూలనకై అల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలను ఉచితంగా పంపిణీ చేశారు. బాపులపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూష మాట్లాడుతూ నులి పురుగుల వల్ల పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదల లోపాలు, పోషకాహార లోపం, రక్తహీనత కలుగుతాయని చెప్పారు. పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 8588 మంది విద్యార్థులకు నులి పురుగుల నిర్మూలన మాత్రలను ఉచితంగా అందించినట్లు మంజూషా తెలిపారు. ఎంపీడీవో ప్రభాకరరావు, ఎంఈవో సక్సేనా రాజు పాల్గొన్నారు.



ఉంగుటూరు: మండలంలో పలు గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. పొట్టిపాడు, పెద అవుటపల్లి పాఠశాలల్లో ఎంపీపీ వి.సరోజిని, ఎంపీడీవో శేషగిరిరావు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. ఉంగుటూరు, ఇందుపల్లి, పెద అవుటపల్లి పీహెచ్‌సీల వైద్యులు నులి పురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఆహారం తీసుకునే ముందు, తరువాత చేతులను శుభ్రం చేసుకోవాలని తెలిపారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

విజయవాడ రూరల్: మండలంలోని నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు, గర్భిణులకు వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. నున్న సచివాలయ ఒకటి పరిధిలో 3,400 మందికి నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. 2వ సచివాలయం పరిధిలో 872 మంది విద్యార్థులకు, గర్భిణులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. 3వ సచివాలయం పరిధిలో 1020 మంది విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమాల్లో ఏఎన్‌ఎంలు కె.రజని, ఆర్.లక్ష్మి, పి.శ్రీదేవి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుస్మిత, సూపర్‌వైజర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు. పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో విద్యార్థులకు ఎన్‌ఎంలు నవత, మురళీకృష్ణ, భూలక్ష్మి, ఆశ వర్కర్లు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు.

క్లుప్తంగా

నేడు హుండీ కానుకల లెక్కింపు

రామవరప్పాడు : విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో బుధవారం భక్తులు అమ్మవార్లకు హుండీల్లో సమర్పించిన కానుకలను లెక్కిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని హుండీలను దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో లెక్కించనున్నట్లు పేర్కొన్నా. సేవాదళ్ సభ్యులచే ఆలయ ప్రాంగణంలో ఈ లెక్కింపు జరుగుతుందన్నారు.

ప్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డు ప్రదానం



గన్నవరం: మండలంలోని దావాజిగూడెం గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్‌కు మధ్యప్రదేశ్‌లోని ఎస్‌పీ. ఫౌండేషన్ ప్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డును ప్రధానం చేసింది. గత 15 ఏళ్లుగా హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ద్వారా వెంకట్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా స్పందన మానసిక వికాస కేంద్రం ద్వారా దివ్యాంగులకు ఉచిత విద్య, వైద్యం, భోజనం, రవాణా సదుపాయలను కల్పిస్తున్నారు. కోవిడ్ కష్ట కాలంలో 20 వేల మందికి అన్నదానం, నిత్యావసర సరుకులు, కూరగాయలు, శానిటైజర్లు పంపిణీ చేశారు. ఆయన సేవలను గుర్తించి ప్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డును ప్రధానం చేసినట్లు ఎస్‌పీ.ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

వైద్య సేవలపై ప్రత్యేక శ్రద్ధ



కంకిపాడు: వైద్యసేవలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతోందని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ అన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. 60 ఏళ్లు నిండిన 55 మంది వృద్ధులకు శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి లక్ష్మి, ఏఎన్‌ఎం పద్మావతి, ఆశ కార్యకర్తలు రాణి, ఉదయలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ఫోరమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఉయ్యూరు: విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఈనెల 17న నిర్వహించే విద్యుత్ ఫోరమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఉయ్యూరు డివిజన్ ఈఈ సీహెచ్ రాంభొట్లు కోరారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉయ్యూరు సబ్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ ఫోరమ్ నిర్వహిస్తున్నామన్నారు. డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు హాజరై సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

200 మందికి వైద్య పరీక్షలు



కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో కేఆర్‌కే డయాగ్నస్టిక్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడకు చెందిన సెంటిని హాస్పిటల్ వైద్యులు సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. షుగర్, బీపీ, రక్తశాతం, బ్లడ్ గ్రూపు పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. డయాగ్నస్టిక్ ప్రతినిధులు, వార్డు సభ్యులు మూల్పూరి మాధవన్ తదితరులు పాల్గొన్నారు.

సత్వర నేత్ర పరీక్షలతో అంధత్వ నివారణ

పెనమలూరు: సత్వర నేత్ర పరీక్షలు చేయటం వలన గ్లోకోమా వల్ల సంభవించే అంధత్వ నివారణ చేయవచ్చని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య శాల కన్సల్‌టెంట్ డాక్టర్ దీప్తి అన్నారు. తాడిగడప ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు తెలిపారు. గ్లోకోమా వ్యాధి పరీక్షలు తమ ఆస్పత్రిలో సమర్థవంతంగా నిర్వహించి అంధత్వం నివారణకు కృషి చేస్తున్నామన్నారు. ఈ నెల 19వ తేదీన ఉదయం 7 గంటలకు అవగాహన కల్పించటానికి వాక్ నిర్వహిస్తామని తెలిపారు.

కోడిపందేల శిబిరంపై దాడి

కంకిపాడు: కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి చేసి నలుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ కె.సుధాకర్ కథనం మేరకు మండలంలోని గొడవర్రు గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్న సమాచారంతో ఆ ప్రాంతంపై సిబ్బంది దాడి చేశారు. దాడిలో నలుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 1800 నగదు, ఒక కోడిపుంజును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

వేగవంతంగా జగనన్న ఇళ్ల నిర్మాణం


ఉయ్యూరు లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఆరా తీస్తున్న ఆర్‌డీఓ విజయ్‌కుమార్

ఉయ్యూరు: జగనన్న లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని ఉయ్యూరు ఆర్‌డీఓ విజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఎగినపాడు, నాగన్నగూడెం జగనన్న లే అవుట్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన సందర్శించారు. పలువురు లబ్ధిదారులను బస్సులో తీసుకెళ్లి ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసే ప్రక్రియపై అధికారులతో సమీక్షించారు. ఆర్‌డీఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉగాది పర్వదినాన లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు వస్తే అధికారులు పూర్తి సహకారం అందించి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటారన్నారు. కాలనీలో ఇళ్లు నిర్మించుకునేందుకు అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గుంజా సుధాకర్‌బాబు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పన్ను నూరుశాతం వసూలు చేయండి

డీఎల్‌పీఓ చంద్రశేఖరావు


సచివాలయ సిబ్బందితో మాట్లా డుతున్న డీఎల్‌పీఓ కె.చంద్రశేఖరావు

అంబాపురం(విజయవాడ రూరల్): అంబాపురం గ్రామంలో ఈ నెలాఖరు నాటికి ఇంటి పన్ను వంద శాతం వసూలు చేయాలని డివిజనల్ పంచాయతి అధికారి కె.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం డిఎల్‌పీఓ అంబాపురం గ్రామ పంచాయతి కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించిన పిమ్మట గ్రామ సచివాలయ సిబ్బంది,వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంబాపురం గ్రామంలో ఈ ఏడాది 20లక్షల 52వేల 429 రూపాయలు ఇంటి పన్ను వసూలు కావాల్సి వుందన్నారు. పాత బకాయిలు 3లక్షల 9వేల 703 రావాల్సి వుందని, అందుకు గాను ఇప్పటి వరకు 18లక్షల 27వేల 515రూపాయలు వసూలు అయ్యిందన్నారు. మిగిలిన మొత్తాన్ని ఈ నెలాఖరులోగా వసూలు చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇఓఆర్డీ బివిఎల్ శేషగిరిరావు, గ్రామ పంచాయతి కార్యదర్శి పి. భారతి పాల్గొన్నారు.

తాడిగడప గ్రామస్తులకు ఇళ్ల స్థలాల అప్పగింత


వణుకూరులో ఇళ్ల స్థలాల స్వాధీనం కోసం వచ్చిన లబ్ధిదారులు

పెనమలూరు: జగనన్న ఇళ్ల స్థలాలను తాడిగడప గ్రామానికి చెందిన లబ్ధిదారులకు మంగళవారం స్వాధీనం చేశారు. వణుకూరు లేఅవుట్–2లో 803 మందికి ప్రభుత్వం గతంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. అయితే ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆదేశాల మేరకు లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోడానికి ఇళ్ల స్థలాల వద్ద సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేసి వాటి పై ప్లాట్ నంబర్లు వివరాలు రాసి లబ్ధిదారులకు స్వాధీనం చేశారు. తాడిగడప కమిషనర్ ఎస్.ప్రకాశరావు మాట్లాడుతూ లబ్ధిదారులు వెంటనే గృహ నిర్మాణాలు చేపట్టాలన్నారు. గృహాల నిర్మాణానికి మెటీరియల్ ప్రభుత్వం ఇస్తోందన్నారు. అదే విధంగా ఉచితంగా ఇసుక కూపన్లు ఇస్తామని తెలిపారు. గృహాల నిర్మాణంలో ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది కూడా తమ వంతు సహకారం అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, లబ్ధిదారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు


జస్టిస్ శేషసాయి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న న్యాయవాదులు

గన్నవరం: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, కృష్ణా జిల్లా పోర్ట్ ఫోలియో జడ్జి జస్టిస్ ఏవీ.శేషసాయిని మంగళవారం బార్ అసోసియేషన్ ఆఫ్ గన్నవరం శాఖ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమర్తల సోమేశ్వరరావు నేతృత్వంలో జస్టిస్ శేషసాయిని దుశ్శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. లీగల్ ఎగ్జిక్యూటివ్ బాడీ సభ్యులు దాసరి భాగ్యలక్ష్మి, అసోసియేషన్ కార్యదర్శి రామకూరి ప్రకాశరావు, న్యాయవాది రామిశెట్టి విమల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకార వేతనాలు

36 మందికి రూ. 4.05 లక్షలు అందజేత


ఉపకారవేతనం అందిస్తున్న దృశ్యం

గుణదల (విజయవాడ తూర్పు) : దృష్టి లోపాలతో ఉన్న విద్యార్థుల అంతర్గత సామర్థ్యాలను వెలికితీసి, వారిని ప్రోత్సహిస్తే ఎంతటి లక్ష్యాలపైనా సాధించగలరని ఆంధ్ర లయోల కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్ అన్నారు. సామర్థ్యాల దినోత్సవం పురస్కరించుకుని లయోలా కళాశాల ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తుల ఉన్నత విద్య విభాగం ఆధ్వర్యంలో దృష్టిలోపం కలిగిన దివ్యాంగులకు పలురకాల పోటీలు, ఉపకారవేతనాల పంపిణీ చేశారు. 'గెస్ ది ఐటం' పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బ్రెయిలీ లిపి పఠనం, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించారు. కాలేజీలోని ఆడిటోరియంలో హెల్ప్ ది బ్లైండ్ ఫౌండేషన్ (చెన్నై) ఆధ్వర్యంలో 36 మంది దృష్టి లోపం కలిగిన దివ్యాంగులకు రూ.4.05 లక్షల ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. హెల్ప్ ది బ్లైండ్ ఫౌండేషన్ ట్రస్టీ దీపా కృష్ణమూర్తి ఆన్‌లైన్ ద్వారా దివ్యాంగులను అభినందించారు. సమర్థనం ట్రస్ట్ ఆధ్వర్యంలో మరో 18 మంది దివ్యాంగులకు రూ.3.57 లక్షల స్కాలర్‌షిప్‌లను అందించారు. ట్రస్ట్ ఏపీ చాప్టర్ అధ్యక్షుడు ఎంఆర్‌కే పరమహంస, రీజనల్ మేనేజర్ పీవీకే శ్రీనివాస్ మాట్లాడుతూ దివ్యాంగుల విద్యాభ్యున్నతికి తమ మద్దతు ఉంటుందని చెప్పారు. విజయవాడ, గుంటూరులోని పలు కళాశాలల్లో నిర్వహించిన అరుళ మ్మాళ్ మెమోరియల్ ట్రోఫీ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను లయోల కాలేజి చేజిక్కించుకుంది. వైస్ ప్రిన్సిపాల్స్ ఫాదర్ అనిల్, ఫాదర్ ప్రభ, కోఆర్డినేటర్ సహాయ భాస్కరన్ పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం

పెనమలూరు: యనమలకుదురులో వృద్ధురాలు అదృశ్యం అవ్వటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం యనమలకుదురు డొంక రోడ్డు చెందిన బండి వెంకటనాగజ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె తల్లి దాసరి మల్లేశ్వరి (55) గత కొద్ది కాలంగా మానసికంగా బాధలు పడుతోంది. అయితే ఆమె ఈ నెల 11వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆమె ఆచూకీ తెలియక పోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పోయినవి

తియ్యగూర వరలక్ష్మి W/o. బ్రహ్మానందరెడ్డి, తేలప్రోలు, ఉంగుటూరు మండలం వారికి సంబంధించిన డాక్యుమెంట్స్ నెంబర్లు 6748/2001, 5803/2000, 5801/2000, 3847/1990 తేలప్రోలు సెంటర్‌లో జిరాక్స్ తీసుకొనుటకు వెళ్ళుచుండగా మార్గం మధ్యలో జారి పోయినవి. ఎంత వెదికినను కనిపించియుండలేదు. ఈ డాక్యుమెంట్స్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెంబరుకు సంప్రదించి తెలియజేయగలరు.

సెల్: 98484 69291

మియాపూర్‌కు నూతన బస్సు సర్వీసు

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): ప్రజా రవాణా సంస్థ విజయవాడ నుంచి మియాపూర్‌కు స్టార్ లైనర్ (నాన్ ఏసీ స్లీపర్ కోచ్) నూతన బస్సు సర్వీసును ప్రారంభించింది. సర్వీస్ నంబర్ 3535 తో నడుపుతున్న ఈ బస్సును మంగళవారం సాయంత్రం విజయవాడ మెయిన్ డిపో నుంచి జోనల్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి లాంఛనంగా ప్రారంభించారు. పండిట్ నెహ్రూ బస్టేషన్ నుంచి రోజూ రాత్రి 11.15 గంటలకు బయలుదేరి కోదాడ, సూర్యాపేట మీదుగా ప్రయాణించి మరుసటి రోజు ఉదయం 5.30 గంటలకు మియాపూర్ చేరుతుంది. తిరిగి ఈ బస్సు సర్వీస్ నంబర్ 3502 తో మియాపూర్‌లో రాత్రి 10 గంటలకు బయలు దేరి ఉదయం 5.30 కు విజయవాడ చేరుకుంటుంది. 30 బెర్తులతో నడిచే ఈ బస్సులో చార్జీలు పైబెర్తుకు రూ. 670, కింది బెర్తుకు రూ. 730 ధరగా నిర్ణయించారు.

ఏప్రిల్ 14న బీఎస్‌ఏ జాతీయ అవార్డుల పంపిణీ

తోట్లవల్లూరు: బహుజన సాహిత్య అకాడమీ చేస్తున్న సేవలు అభినందనీయమని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు శొంఠి నాగరాజు అన్నారు. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యాన ఏప్రిల్ 14న ఉయ్యూరులో నిర్వహించే బీఎస్‌ఏ నేషనల్ అవార్డ్స్–2023కి సంబంధించిన పోస్టర్‌ను మండల కేంద్రమైన తోట్లవల్లూరులో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 124వ జయంతి రోజున ప్రపంచ జ్ఞానదినోత్సవం సందర్భంగా ఉయ్యూరు బైపాస్ రోడ్డులోని గ్రీన్‌ల్యాండ్ రిసార్ట్సు ఆవరణలో వివిధ రంగాలలో ఉత్తమసేవలు అందించిన వారికి అవార్డులు అందిస్తున్నామని తెలిపారు.

మరింత వేగంగా స్మృతి వనం పనులు


పనులు పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్

పటమట(విజయవాడ తూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్మిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులను మరింత వేగవంతం చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్వరాజ్య మైదాన్‌లో జరుగుతున్న స్మృతివనం, 125 అడుగుల విగ్రహ పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ విగ్రహ నిర్మాణాన్ని నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకుని పనులు వేగవంతం చేయాలన్నారు. అనంతరం ఆయన ఫ్లోరింగ్‌కి వేసిన గ్రానైట్ డిజైన్లను పరిశీలించారు. పర్యటనలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ఏపీఐఐసీ, కేసీపీ ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com